## కథకుడుగా అతనికి వచ్చిన సమస్య ఎలా పరిష్కారమయింది?

# లోకో భిన్నరుచి

## మండల రామారావు కథ

**నేనంటే వాడికి పరమ అసహ్యమట!**

నేనో అప్రాచ్యపు వెధవనట! అపశకునపు పక్షినట! నేనో దుష్టుణ్ణట. భ్రష్టుణ్ణట. నేనువీధిలోకి రాగానే వాడు ఇంట్లోకి పలాయన మంత్రం పఠిస్తాడు. నేనెదురొస్తే వాడికి ఏ వరాహమో, ఏ మార్జాలమో ఎదురైనట్లుంటుందట. నేను రోడ్డుమీద ఏ కూరలమ్మే వ్యక్తిని పిలిచినా ఆ పిలుపు వాడికి దివాభీతం అరుపులా వినిపిస్తుందట.

నాకు కారణం తెలియక తల బద్దలుకొట్టుకుంటున్నాను. ఆరా తీయగా తీయగా తెలిసిందేమిటంటేనేను కథలు వ్రాస్తానట. కథలంటే వాడికి అయిష్టమా అంటే అదీ కాదట. నేను హాస్య కథలు వ్రాస్తానంట.

హాస్యకథలంటే వాడికి అజీర్ణమా అంటే అదీ కాదట. నేను హాస్యకథల్లో అమితంగా అశ్లీల శృంగారాన్ని చొప్పిస్తానట. అంత మాత్రాన తన మాటే వీధికి వేదమనే అహంకారంతో మా పనిమనిషి, వంటమనిషికి రహస్యంగా ఏవేవో కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మా ఇంటికి రాకుండానే చేస్తాడా!

మా అర్ధాంగి వీధి కుళాయి దగ్గరకు వెళితే ''ఈవిడే భానుమూర్తిగాడి పెళ్లాం'' అంటూ చెవులు కొరుక్కుంటూ చులకనగా చూస్తారా!

ఆ పేరిశాస్త్రి పోరు పడలేక, శ్రీమతి మాట కాదనలేక నా చుట్టూ పరిభ్రమించే మిత్రబృందం మాటను ఎదిరించి మరీ మరో వీధిలోని అద్దె ఇంటికి మారక తప్పలేదు.

ఆ! చెప్పడం మరిచా! నేను సాంఘిక సినిమాలకు కూడా కథలు వ్రాస్తానని ఆ వీధి వీధంతా వింతగా విడ్డూరంగా చాటింపు వేశాడట.

వీడికి వచ్చిన నష్టమేమిటంట! నా భావం నాది. నా భాష నాది. నా శిల్పం నాది. నా శైలి నాది. నా



వర్ణన నాది. నా కథలను, నన్నూ అభిమానించేవారి సంగతి ఎలా వున్నా నా కథలు చదివి ఏ పడతీ చెడలేదే!

ఆ మాటకొస్తే ఆ పేరిశాస్త్రి ప్రతి ఉదయాన్న ఊరంతా వినపడేలా వల్లించే కుమార సంభవంలోని శ్లోకాలు అశ్లీలతతోను, అసభ్యతతోనూ నిండివున్నవి కాదా! కాళిదాసు మాత్రం పార్వతిని అలా నఖశిఖ పర్యంతం వర్ణించ తగునా! ఆవిడ

కురులు... నాసిక, మెడ, మెడలోని ఆభరణాలు పరస్పరం శోభను చేకూర్చుకుంటాయట!

అంతవరకైతే ఫర్వాలేదు. ఆవిడ నాభిగూర్చి, నడుము గూర్చి పాఠకులకు ఎబ్బెట్టు అనిపించేటంతగా వర్ణించాడే! అంతటితో విడిచిపెట్టాడా! ''కంఠస్యతస్యాస్తనబంధురస్స'' అంటూ ఆవిడ స్తనములు గూర్చి, ఊరువులగూర్చి ఆ రకంగా వర్ణించడం... రామరామ! అంత పవిత్రమైన దేవిని అంత అపవిత్రమైన పదజాలంతో వర్ణించడం సబబా!

ఆ పేరిశాస్త్రికి కాళిదాసు అశ్లీల వర్ణన నచ్చింది కాబోలు. నేను నా కథల్లో అక్కడక్కడ నాయిక బుగ్గ మీద బ్యూటీస్పాట్‌గూర్చో, కందిరీగ నడుములాంటి సన్నటి నడుముగూర్చో, తెల్లటి నున్నటి బ్లౌజునుండి పొడుచుకుని వచ్చే ఆ... గూర్చో వర్ణిస్తే అది భ్రూణహత్యటండీ! నాకు వళ్లు మండిపోతుంది.

అందమైన హిమాలయ పర్వతశ్రేణిగూర్చి - అందున జన్మించిన పార్వతిగూర్చి తనదైన బాణిలో ఒక కవి వర్ణిస్తే, అత్యంత అసహ్యకరమైన మురికి గుంటను గూర్చి, అందు పుట్టిన కలువపూవును గూర్చి తనదైన వాణిలో విప్పిచెప్పే మరొక కవి వుంటాడు. తీవిగల రాయంచ ఒకరికి కథావస్తువైతే, రోతగల గబ్బిలం మరొక కథకుడికి ఆదర్శ వస్తువవుతుంది. నల్లేరుని గూర్చి పల్లేరును గూర్చి వర్ణించిన కవులెందరు లేరు. లోకో భిన్నరుచిః.

శ్రీమతితోపాటు ట్రైనింగ్‌కని మరో పట్టణం వెళుతూ మూడు నెలలు అనంతారం తిరిగి వచ్చెదమని ఇంటి యజమానికి చెప్పి వెళ్లినా నేను లేని సమయంలో ఆ పేరిశాస్త్రి వచ్చి ఆ ప్రాంతంలోని వారందరి నోట్లో నా గురించి విషం క్రక్కుతాడనే అనుమానం పెనుభూతంలా నా మెదడులో మెదులుతూనే వుంది. అసలు ఆ వీధి పట్టణానికి నడిబొడ్డులో వుందావె! అది నా మిత్రుని పుత్రుని ఇల్లు కాబట్టి నా ఇంట్లో అల్లరి చేసే పిల్లలు లేరుకాబట్టి, నా కథలకూ, నవలలకూ వచ్చే రాయల్టీలు అతనికి తెలుసును కాబట్టి నేను క్రమం తప్పక అద్దె చెల్లిస్తాననే విశ్వాసం అతనికి వుంది కాబట్టినాకు కొంత రాయితీతో ఆ ఇల్లు అద్దెకు ఇచ్చాడు.

ట్రైనింగ్ ఓ పది రోజులకు పూర్తి అవుతుందనగానే ఓ రోజు రాత్రి నాకో కల వచ్చిన మాట నిజమే! అందున పేరిశాస్త్రి ఓ వింత ఆకారంలో... ఆ ఆకారం మొదట్లో మనిషిగా క్రమక్రమంగా దయ్యం, భూతం, పిశాచం, శక్తిగా మారి మహాశక్తిగా కనిపించి నల్లటి ముఖంతో తెల్లటి పళ్లతో పకపకా వికవికా నావంకచూసి నవ్వడంవలన నా మస్తిష్కంలో ఏవేవో వింత వింత ఆలోచనలు మెదలసాగాయి. అందునా అది తెల్లవారుజామున వచ్చిన కలాయె.

అందువల్ల నేను ఉదయాన్నే ఒకరోజు శలవుపెట్టి మా ఇంటికి వెళ్లాను. అనుకున్నంత పనీ అయింది. మా ఇంటికి రెండురోజుల క్రితం ఆ పేరిశాస్త్రి వచ్చి నా రాక గూర్చి, నా గూర్చి అడిగినట్లు ఇంటి యజమాని నాతో చెప్పాడు. అయితే అంతకుమించి ఏ విధమైన చెడు మాటలు మాట్లాడలేదని కూడా నాకు ఇంటి ఆసామీ వలన తెలియవచ్చింది. కల నిజమయ్యే సమయం సమీపిస్తుందని నా మనసు ఘోషించింది.

ఏది ఏమైనా పదిరోజులు ట్రెయినింగ్ పూర్తికాగానే ఇద్దరం ఇంటికి వచ్చేశాం. నేను ఇంటికి వచ్చిన మూడు రోజులవరకు నా అభిమాన మిత్రబృందంలోని సభ్యులెవరూ మా ఇంటికి రాకపోగా పువ్వులూ, పండ్లు, పారితోషికంతో పేరిశాస్త్రి దంపతులు మా గుమ్మంలోకి అడుగుపెట్టడం మాకు ఆశ్చర్యం గొలిపింది.

రెండు. వారాలవాడు విడుదలైన 'అమావాస్యకథ' అనే దీపావళి కథ సినిమా చూస్తున్న పేరిశాస్త్రికి అందులోని పాటలూ మాటలు వ్రాసిన 'భానుశ్రీ' నీ తాకిడికి తట్టుకొనలేక వీధినుండి పారిపోయిన ఆ భానుమూర్తేనని ఎవరో చెప్పారట! అదీ కథ.

నేను మాటలూ పాటలూ వ్రాసిన ఆ పౌరాణిక చిత్రం చూచి నాకు దూరమవుతున్న నా అభిమాన మిత్రబృందాన్ని, పేరిశాస్త్రిని కలిపి కుడి ఎడమల నిలబెట్టుకోవడం ఎలా అనే నా అంతరంగంలోని ఆలోచనా తరంగాలకు పరిష్కారమార్గం దొరికేదెప్పుడో! ★★★



ఈ కుర్చీ నేనే చేసేనోయ్. కూర్చో. ఎలావుందో చెప్పు.